
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
ఆదివారం 31 ఆగస్టు 2025



జిల్లాలో ఐదు మద్యం బార్లకు లైసెన్స్ ఖరారు

శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఐదు మద్యం బార్‌లకు అధికారులు లైసెన్స్‌లు ఖరారు చేశారు. డీఆర్వో వెంకటేశ్వరరావు, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో శనివారం శ్రీకాకుళం అంబేడ్కర్ ఆడిటోరియంలో ఈ ప్రక్రియ నిర్వహించారు. మొత్తం 19 బార్‌లకుగాను ఐదు బార్‌ల టెండర్లు నిర్వహించి.. లాటరీ విధానం ద్వారా లైసెన్స్‌లు మంజూరు చేశారు. శ్రీకాకుళంలో మూడు బార్‌లకు 12దరఖాస్తులు, రిజర్వ్ కేటగిరిలో శ్రీశయన కులానికి కేటాయించిన ఒక్క బార్‌కు ఆరు దరఖాస్తులు వచ్చాయి. పలాసలో సొండి కులానికి కేటాయించిన ఒక్క బార్‌కు నాలుగు దరఖాస్తులు అందాయి.

కాగితాల్లోనే కూరలు..

వంటలో ఉండవ్!





శ్రీకాకుళం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి):

జిల్లాలో ఉన్నతాధికారుల అనాలోచిత నిర్ణయాలతో వసతిగృహ విద్యార్థులకు అన్యాయం జరుగుతోంది. ప్రజాప్రతినిధులు కూడా పట్టించుకోకపోవడంతో కూరగాయలు, నిత్యావసర సరుకుల సరఫరాలో నాణ్యత లోపిస్తోంది. కొన్ని నెలలు కిందట కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాల్లో

- కిలో కూరగాయలు రూ.10 మాత్రమే
- వసతిగృహాల్లో కానరాని పారదర్శకత
- సాధ్యం కాని ధరలకు టెండర్ల ఆమోదం
- జాబితాలో దినుసులు.. భోజనంలో ఉండవాయె
- సరిపడా సరుకులు ఇవ్వలేని కాంట్రాక్టరు..
- పత్రాల్లో మాత్రం సరఫరా చేస్తున్నట్లు జమ
- డిమాండ్ చేయలేని వార్డెన్‌లు
- ఎంజేపీ ఏపీ బీసీడబ్ల్యూఆర్ స్కూల్స్‌లో పరిస్థితి
- అధికారుల తీరుపై చర్చ

కిలో కూరగాయలు కేవలం రూపాయి చొప్పున కాంట్రాక్టర్ టెండర్ వేశారు. రూపాయికే కిలో కూరగాయలు సరఫరా సాధ్యం కాదని తెలిసినా.. ఉన్నతాధికారులు ఆమోదించేశారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇటీవల మళ్లీ అదేరీతిలో జిల్లాలో 'మహాత్మాజ్యోతీరావుఫూలే' ఏపీ బీసీడబ్ల్యూఆర్ స్కూల్స్ (బాలికలు)లో కూరగాయలకు టెండర్ కట్టబెట్టారు. ఇప్పుడు కూడా వాస్తవ ధరలకు అందనంత దూరంలో కాంట్రాక్టర్ కోట్ చేసి టెండర్ వేశారు. చాలా కూరగాయలు కిలో రూ.10 చొప్పున సరఫరా చేస్తానని టెండర్‌లో స్పష్టం చేశారు. మొత్తం 26 రకాల దినుసులు కేవలం రూ.305కే అందజేస్తానని వెండర్ అంగీకరించారు. కాగా.. అమలుకాని ధరలతో విద్యార్థులకు నష్టం జరుగుతుందన్న ఆలోచన లేకుండా అధికారులు ఓకే చేయడం చర్చనీయాంశమవుతోంది. వాస్తవంగా మార్కెట్‌లో కంటే కిలో కూరగాయలు లేదా ఇతర దినుసులకు రూపాయి నుంచి కనీసం రూ.10 వరకు మార్జిన్ ఉంటుంది. కానీ ఇక్కడ 26 రకాల దినుసులలో 22 రకాలను.. అందులో ఒక్కోటి కిలో రూ.10కే సరఫరా చేసేస్తామని టెండర్ వేయడం.. అధికారులు ఖరారు చేసేయడం గమనార్హం. మార్కెట్‌లో ఏ ఒక్క కూరగాయలు కూడా అరకిలో కూడా రూ.10కి లభించడంలేదు. కొన్ని కూరగాయల ధరలు పరిశీలిస్తే.. రూ.వందకు సమీపంలోనూ.. మరికొన్ని రూ.వంద పైబడే ఉన్నాయి. ఈ నేపథ్యంలో అంత తక్కువ ధరకు టెండర్లు ఎలా ఆమోదించారనేది ప్రశ్నార్థకమవుతోంది. కిలో రూ.10 చొప్పున కూరగాయలను... అధికంగా టెండర్ అగ్రిమెంట్ పత్రాలలోనే.. ఆపై బిల్లులలో సరఫరా చేసినట్లు ఉంటుంది. కానీ వాస్తవంగా కొన్ని కూరగాయలను విద్యార్థులు రుచి కూడా చూసినట్లు ఎరుగరు. అధికారులు కనీసం నెలకోసారి హాస్టల్‌లో తనిఖీలు చేపట్టి.. కూరగాయల సరఫరా, వంట సక్రమంగా (మిగతా 6వ పేజీలో..)

కూరగాయల ధరలు ఇలా.. (కిలో)

కూరగాయలు	టెండర్ ధర	మార్కెట్ ధర
వంకాయ	రూ. 10	రూ. 40
బెండకాయలు	రూ. 10	రూ. 40
క్యాబేజీ బుట్ట	రూ. 10	రూ. 30
దొండకాయ	రూ. 10	రూ. 35
బీరకాయ	రూ. 10	రూ. 35
క్యాబేజీ పువ్వు	రూ. 10	రూ. 45
ఆనపకాయ	రూ. 10	రూ. 25
పొడుపు చిక్కుడు	రూ. 10	రూ. 30
టొమాటో	రూ. 10	రూ. 55
పందిరి చిక్కుడు	రూ. 10	రూ. 60
పొటల్స్	రూ. 10	రూ. 70
ఎర్ర దుంప	రూ. 10	రూ. 40
బంగాళాదుంప	రూ. 15	రూ. 20
ఉల్లిపాయలు	రూ. 10	రూ. 25
కారెట్	రూ. 10	రూ. 40
బీట్‌రూట్	రూ. 10	రూ. 40
అరటికాయ	రూ. 10	రూ. 20
మునక్కాయ	రూ. 10	రూ. 40
పర్చిమిర్చి	రూ. 10	రూ. 80
అల్లం	రూ. 10	రూ. 90
ముల్లంగి	రూ. 10	రూ. 40
నిమ్మకాయలు	రూ. 50	రూ. 50
కరివేపాకు/కొత్తిమీర (కట్ట)	రూ. 10	రూ. 10
తోటకూర (కట్ట)	రూ. 10	రూ. 10
పుదీనా/మెంతుకూర(కట్ట)	రూ. 10	రూ. 10
కొబ్బరికాయ (ఒకటి)	రూ. 10	రూ. 20

మళ్లీ మాతృ వందనం

- అమలుకు ప్రభుత్వం చర్యలు
- ఐదేళ్లూ వదిలేసిన వైసీపీ సర్కారు



టెక్కలి రూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకర ప్రసవాలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం 2017లో ప్రధానమంత్రి మాతృ వందన యోజన(పీఎంఎంవీవై)ను ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా గర్భిణులు, బాలింతలకు ఆర్థికసాయం అందించేది. గత వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేయడంలో నిర్లక్ష్యం చేసింది. కేంద్రం నుంచి వచ్చిన నిధులను వివిధ కార్పొరేషన్లకు దారి మళ్లించింది. దీంతో ఈ పథకం ఉన్నట్లు దాదాపు ప్రజలు మరచిపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ మాతృ వందనం పథకాన్ని పటిష్ఠంగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. గతంలో వైద్యఆరోగ్యశాఖ ఈ పథకం పర్యవేక్షణ బాధ్యతను చూసేది. ఇప్పుడు ఆ బాధ్యతను మహిళా శిశు సంక్షేమ శాఖకు బదలాయించారు. ప్రస్తుతం జిల్లాలో ఈ పథకాన్ని అమలు చేయడానికి అంగన్‌వాడీ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నారు.

తల్లుల ఖాతాల్లోకి..

జిల్లాలో 3,562 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో గర్భిణులు 9,206 మంది, బాలింతలు 7,292 మంది ఉన్నారు. వీరందరికీ ఈ పథకం వర్తిస్తుంది. ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉన్న కుటుంబాల్లోని గర్భిణులకు సరైన పోషకాహారం అందక ప్రసవం సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ప్రసవం తరువాత బిడ్డలకు కూడా పోషకాహారం అందించలేని పరిస్థితి ఏర్పడుతుంది. కొంతమంది బాలింతలు తమ పిల్లలకు టీకాలు వేయించేందుకు అప్పు సైతం చేయాల్సి వస్తుంది. ఇటువంటి వారికి మాతృ వందనం పథకం ఎంతో ఉపయోగపడనుంది. ఇందులో రూ.11వేల వరకు సాయం అందిస్తారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యేక లాగిన్ కేటాయించారు. అందులో లబ్ధిదారుల వివరాలు నమోదు చేసేందుకు అధికారులు వారికి అవగాహన కల్పిస్తున్నారు. తెలుపు రేషన్ కార్డు ఉన్నవారు అర్హులు. గర్భం దాల్చిన తరువాత రూ.1000 ఇస్తారు. ప్రసవం అనంతరం రూ.2వేలు, ఏడాదిలో బిడ్డకు టీకాలు పూర్తయిన తరువాత మరో రూ.2వేలు నేరుగా లబ్ధిదారు ఖాతాలో జమవుతుంది. రెండో కాన్పులో ఆడపిల్ల జన్మిస్తే రూ.2వేల చొప్పున మూడు విడతల్లో జమవుతుంది. రెండు కాన్పుల్లో కుమారుడు, కుమార్తె జన్మిస్తే మొత్తం రూ.11 వేలు లబ్ధిచేకూరుతుంది. ఈ విషయమై మెళియాపుట్టి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అమరావతిని వివరణ కోరగా.. 'మాతృ వందనం పథకం కోసం కార్యాచరణ ప్రారంభమైంది. అంగన్‌వాడీ కార్యకర్తలకు లాగిన్ ఇచ్చి గర్భిణులు, బాలింతల వివరాలు నమోదు చేయడంపై అవగాహన కల్పిస్తాం. తరువాత తల్లుల బ్యాంకు ఖాతాల్లో విడతల వారీగా పీఎంఎంవీవై నిధులు జమవుతాయ'ని తెలిపారు.

ముమ్మరంగా స్మార్ట్‌రేషన్ కార్డుల పంపిణీ

- గ్యాస్‌కి అదనపు వసూలు వద్దు : జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ముమ్మరం చేశామని జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'జిల్లాలో 6,51,717 రేషన్‌కార్డులు ఉన్నాయి. వాటిస్థానంలో కొత్తగా వచ్చిన క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేస్తున్నాం. కార్డుదారులు రేషన్‌షాపు పరిధిలో సచివాలయ సిబ్బంది లేదా డీలర్ ద్వారా బయోమెట్రిక్ విధానంలో కార్డులు తీసుకోవాలి. ఇంకా కొంతమంది ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. ఈకేవైసీ కానివారికి ప్రభుత్వ పథకాలు వర్తించవు. జిల్లాలో కొంతమంది హోటల్ యజమానులు గృహావసర సిలెండర్లను వాణిజ్య అవసరాలను ఉపయోగిస్తున్నట్లు గుర్తించాం. ఇది చట్టరీత్యా నేరం. దీపం పథకం కింద సిలిండర్‌కు వినియోగదారుల నుంచి ఎటువంటి రవాణా చార్జీలు వసూలు చేయరాదు. గ్యాస్ ఏజెన్సీలు 15కిలోమీటర్ల లోపల గల వినియోగదారుల ఇళ్లకు ఉచితంగా సిలిండర్లను సరఫరా చేయాలి. కొంతమంది డెలివరీ బాయ్స్ వినియోగదారుల నుంచి ఎక్కువ మొత్తాన్ని వసూలు చేస్తున్నారు. అటువంటివారిపై చర్యలు తప్పవు. రశీదుపై పేర్కొన్న మొత్తాన్ని మాత్రమే వినియోగదారులు చెల్లించాలి. ఈ అంశంపై గ్యాస్ ఏజెన్సీ యజమానులు తమ డెలివరీ బాయ్స్‌కు తగు సూచనలు ఇవ్వాల'ని ఆదేశించారు.



శ్రీకాకుళం : నాగావళి నదిలో వినాయక విగ్రహాలు నిమజ్జనం చేస్తున్న ఈతగాళ్లు

ఆఖరి ఘట్టం.. అప్రమత్తతే ముఖ్యం

- ప్రారంభమైన గణేష్ నిమజ్జన ఉత్సవాలు
- వర్షాలతో నిండుగా ఉన్న చెరువులు, నదులు
- జాగ్రత్తలు తీసుకోకుంటే ప్రమాదం

6లో

'ఎత్తిపోతలు' కోసం ఎదురుచూపు

- గార వద్ద పథకాన్ని పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- ప్రస్తుత కూటమి పాలనలో కదలిక
- త్వరగా పనులు పూర్తిచేయాలని రైతుల విజ్ఞప్తి



వంశధార నదిలో ఊటబావికి పుట్‌పాత్ పనులు

గార, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): గార వద్ద వంశధార నదిపై నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకం పనులు ఎప్పుడు పూర్తవుతాయోనని ఆయకట్టు రైతులు ఎదురుచూస్తున్నారు. బైరి కాలువ పరిధిలో 2,200 ఎకరాలకు సాగునీరు అందించేందుకు 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.3కోట్ల వ్యయంతో ఎత్తిపోతల పథకం పనులకు శంకుస్థాపన చేశారు. కొన్నాళ్లు పనులు చురుగ్గా సాగాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పనులు నిలిచిపోయాయి. దీంతో రైతులు సాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎత్తిపోతల పథకం పనులు పూర్తిచేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఎమ్మెల్యే గొండు శంకర్ కృషి ఫలితంగా ఏపీఎస్ఐడీసీ ఇంజనీర్ల పర్యవేక్షణలో పనులు చేపడుతున్నారు. ఎత్తిపోతల పథకం (మిగతా 6వ పేజీలో..)

దోమల నివారణకు మహాయుద్ధం
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- ఇంద్రపుష్కరిణిలో విడిచిపెట్టిన గంబూషియా చేపలు

6లో

మురుగు కూపాల్లా ఖాళీ స్థలాలు
- డ్రైనేజీలు లేక అవస్థలు
- విజృంభిస్తున్న దోమలు
- రోగాల బారిన ప్రజలు

8లో

సర్టిఫికెట్లు తీసుకుని తిరిగి వస్తుండగా..
- ఎచ్చెర్లలో హైవేపై రోడ్డు ప్రమాదం
- యువకుడికి బ్రెయిన్ డెడ్.. అవయవదానానికి అంగీకారం

ప్రజా సమస్యలు పరిష్కరించాలి
- పశువులు, కుక్కలు, కోతుల బారినుంచి కాపాడండి
- మునిసిపల్ సమావేశంలో సభ్యులు

7లో

శరవేగంగా..



కాశీబుగ్గ రైల్వే బ్రిడ్జి పనులు..

- కాశీబుగ్గ రైల్వే ఫ్లైఓవర్ పనులు
- తీరిన నిధుల కొరత, నిర్వాసితుల సమస్య
- వచ్చే మార్చి నాటికి పూర్తి చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

కాశీబుగ్గ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి):

కాశీబుగ్గ రైల్వే ఫ్లైఓవర్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ వంతెనపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన నిధులు మంజూరు చేయడంతోపాటు నిర్వాసితుల సమస్యలను పరిష్కరించింది. దీంతో ఎలాంటి అడ్డంకి లేకపోవడంతో పనులు చురుగ్గా సాగుతున్నాయి. వచ్చే ఏడాది మార్చి నాటికి వంతెనను అందుబాటులోకి తీసుకురావాలన్నదే ప్రభుత్వ లక్ష్యం.

ఇదీ పరిస్థితి..

పలాస రైల్వేస్టేషన్‌కు కూతవేటు దూరంలో కాశీబుగ్గ లెవల్ క్రాసింగ్ గేటు ఉంటుంది. ప్రతిరోజూ ఈ గేటు మీదుగా వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. జంట పట్టణాలతో పాటు ఒడిశా, శ్రీకాకుళం, విశాఖకు వెళ్లే మార్గం కావడంతో వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. దీంతో 2009లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇక్కడ ఎల్‌సీ గేటుతో పాటు బెండిగేటు వద్ద ఫ్లైఓవర్ నిర్మాణాలను ప్రారంభించింది. అయితే బెండిగేటు వద్ద సకాలంలో వంతెన నిర్మాణం పూర్తయ్యింది. కాశీబుగ్గ లెవల్ క్రాసింగ్ వద్ద మాత్రం షాపులు, నివాసాలు తొలగించాల్సి ఉండడంతో వంతెన పనుల్లో జాప్యం జరిగింది. ఈ వంతెన నిర్మాణానికి అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం రూ.28 కోట్లు, రైల్వేశాఖ రూ.28 కోట్లు విడుదల చేశాయి. రైల్వే పరంగా ట్రాక్‌పై భాగంలో వంతెన నిర్మాణం పూర్తయింది. మిగతా పనులు మూడు అడుగులు ముందుకు.. ఆరు అడుగులు వెనక్కి అన్న చందంగా మారాయి. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం కొంతవరకూ పనులు చేయగలిగింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం హడావుడి చేసింది తప్ప వంతెన నిర్మాణం పూర్తిచేయలేకపోయింది. వంతెనను పూర్తి చేసి దానిపైనే 2024 ఎన్నికల ప్రచారానికి వెళతామని వైసీపీ నాయకులు గొప్పలు చెప్పారు. కానీ, ఐదేళ్లు కనీసం పట్టించుకోలేదు. కాంట్రాక్టర్‌కు రూ.6 కోట్ల వరకూ బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిపివేశాడు. అటు నిర్వాసితుల సమస్యలు కూడా పరిష్కారానికి నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో కలిసి కేంద్ర మంత్రులు నితిన్‌గడ్కరి, అశ్వనీ వైష్ణవ్‌ను కలిసి వంతెన సమస్యను వివరించారు. దీంతో వంతెన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు (మిగతా 6వ పేజీలో..)



మాది చేతల ప్రభుత్వం..

వంతెన పునర్నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మార్చి నాటికి పూర్తిచేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం. పనుల ప్రగతిపై ప్రతిరోజూ అధికారులతో మాట్లాడుతున్నా. గత వైసీపీ ప్రభుత్వం మాటలు తప్ప పనులు చేపట్టలేదు. మాది చేతల ప్రభుత్వం. పలాస నియోజకవర్గంలో ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తా. అభివృద్ధి ప్రణాళిక తయారు చేశా. మంత్రులతో కలిసి పలాసను అభివృద్ధి చేస్తా.

-గౌతు శిరీష, ఎమ్మెల్యే, పలాస

13న జాతీయ లోక్ అదాలత్

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు

శ్రీకాకుళం లీగల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్‌అదాలత్ సెప్టెంబరు 13న నిర్వహించనున్నామని, ఎక్కువ పెండింగ్ కేసులు రాజీ అయ్యేలా కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. శనివారం సంస్థ కార్యాలయంలో బ్యాంకు, ఇన్సూరెన్స్, చిట్‌ఫండ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కక్షిదారులకు న్యాయం చేకూర్చేలా కేసులను రాజీ చేయాలన్నారు. రాజీ వల్ల సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. కేసులు పరిష్కారమయ్యేలా కక్షిదారులకు అవగాహన కలిగించాలని కోరారు. కార్యక్రమంలో లీగల్‌ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆఖరి ఘట్టం.. అప్రమత్తతే ముఖ్యం



కోమర్తి వద్ద నిండుగా ప్రవహిస్తున్న నూకాలమ్మ చానల్

- ప్రారంభమైన గణేశ నిమజ్జన ఉత్సవాలు
- జాగ్రత్తలు తీసుకోకుంటే ప్రమాదం
- వర్షాలతో నిండుగా ఉన్న చెరువులు, నదులు

నరసన్నపేట/శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి)



హిందువుల పండుగల్లో గణపతి నవరాత్రులకు ఉన్న ప్రత్యేకత వేరు. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ ఆనందోత్సాహాల నడుమ వేడుకల్లో పాల్గొంటారు. ఈ వేడుకల్లో నిమజ్జన కార్యక్రమం మరింత ప్రత్యేకం. ఆ సమయంలో అప్రమత్తంగా వ్యవహరించడం ద్వారా మరింత ఆనందాన్ని మదిలో నింపుకోవచ్చు. జిల్లాలోని అనేక గ్రామాలు, పట్టణాల్లో గణేశ విగ్రహాలను ఏర్పాటు చేశారు. వీటిలో కొన్నింటిని మూడోరోజు నుంచి నిమజ్జనం చేస్తారు. ఎక్కువగా తొమ్మిదో రోజున నిమజ్జనం చేస్తారు. సెప్టెంబరు 7న చంద్రగ్రహణం ఉంది. కాబట్టి అంతకు ముందుగానే నిమజ్జనం చేయాల్సి ఉంది. జిల్లాలో ఎక్కువగా 3వ తేదీ నుంచి నిమజ్జనాలు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. అర్ధరాత్రి వరకు ఊరేగించి సమీపంలోని చెరువులు, కాలువలు, నదుల్లో నిమజ్జనం చేస్తుంటారు. ఈ సమయంలో ఎక్కువగా ప్రమాదాలు, వివాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. కాబట్టి వీటికి తావులేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. తీర ప్రాంత మండలాల్లోని సముద్రంలో గణనాథుల విగ్రహాల నిమజ్జనం జరుగుతుంది. ఆ సమయంలో ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా మూల్యం చెల్లించుకోక తప్పదు. ముఖ్యంగా చిన్నారుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

- ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చాలా చోట్ల చెరువులు, నదులు నీటితో నిండుగా ఉన్నాయి. ఇలాంటిచోట్ల నిమజ్జన సమయంలో అప్రమత్తంగా ఉండాలి. ఈత తెలిసిన వారు మాత్రమే... అదీ ఒడ్డున ఉంటూ కార్యక్రమం పూర్తి చేయాలి. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో చెరువులతో పాటు నాగావళి, వంశధార, బహుదా, మహేంద్రతనయ నదులు, కాలువలను నిమజ్జనాలకు ఎంచుకుంటారు. వీటిలో నీరు ప్రమాదకరస్థాయిలో ఉందనే విషయాన్ని గుర్తించాలి.
- ఉపాధి పనులు చేపట్టడం వల్ల చెరువులు లోతుగా ఉంటాయి. లోతు తెలియని వారు ఎటువంటి పరిస్థితుల్లోనూ చెరువుల్లో దిగరాదు. గుంతల్లో దిగితే మునిగిపోయే ప్రమాదం ఉంది.
- చాలామంది మద్యం తాగి ఊరేగింపులోకి వస్తుంటారు. అలాంటి వారిని వేడుకలకు దూరంగా ఉంచాలి. ఊరేగింపు సమయంలో రహదారులపై వాహనాల రాకపోకలను గమనించాలి. ట్రాఫిక్ ఇబ్బందులు సృష్టించకూడదు.
- ఎత్తయిన విగ్రహాలను వాహనాల్లో తరలించే సమయంలో విద్యుత్ తీగలను గమనించాలి. గతంలో వీటి కారణంగా ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి.
- నిమజ్జనంలో అధిక శబ్దాలు వచ్చే డీజే వంటి బాక్సులను ఏర్పాటు చేయరాదు. పోలీసుల సూచనల మేరకు స్పీకర్లను ఏర్పాటు చేసుకోవాలి.
- పోలీసులు సూచించిన మార్గంలోనే నిమజ్జన ఊరేగింపు ఉండాలి. గ్రామాల్లో ఐదారు విగ్రహాలు ఏర్పాటు చేస్తారు. అన్ని విగ్రహాలను ఒకే రోజు.. ఒకే సమయంలో నిమజ్జనం చేయకుండా జాగ్రత్త పడాలి.
- నిమజ్జనం ఊరేగింపులో పాతకక్షలు ఉంటే బయట పడే అవకాశాలు మెండుగా ఉంటాయి. ప్రత్యర్థులపై దాడులు చేసేందుకు కొందరు వేదికలుగా మలుచుకుంటారు. ఇలాంటి సంఘటనలకు అవకాశం లేకుండా కమిటీ సభ్యులు నిమజ్జన ఊరేగింపు సజావుగా సాగేలా చూసుకోవాలి.
- ఊరేగింపులో వేషధారణలపై ముందుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
- మద్యం, గంజాయి వంటివి తాగి నిమజ్జనాల్లో పాల్గొనే వారు ఇబ్బందులు సృష్టిస్తుంటారు. అలాంటి వారిని గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి.
- పోలీసులు గుర్తించిన సురక్షితమైన ప్రదేశాల్లో మాత్రమే విగ్రహాలను నిమజ్జనం చేయాలి.
- బాణసంచా పేల్చే సమయంలో అప్రమత్తంగా ఉండాలి. ప్రధాన రహదారులపై మందుగుండు పేల్చరాదు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

ఇంకా ఏం చేయాలంటే..

నిమజ్జన వేడుకల్లో పాల్గొనేవారు కూడా వీలైనంత వరకు తేలికపాటి దుస్తులు ధరించడం ఉత్తమం. వేడుకల్లో పాల్గొనేవారు తాగునీరు, స్నాక్స్ లాంటివి తీసుకెళ్లడం మంచిది. రద్దీగా ఉండే ప్రాంతాల్లో దొంగలు ప్రతాపం చూపిస్తారు. అందుకే విలువైన వస్తువులు ధరించి నిమజ్జన వేడుకల్లో పాల్గొనవద్దు. తప్పనిసరిగా వేసుకోవాల్సిన వస్తువులుంటే తగిన జాగ్రత్తలు పాటించండి. ఫోన్లు లాంటివి బ్యాగులలో భద్రపరచడం మంచిది.

- నిమజ్జన సమయంలో పర్యావరణ కాలుష్యాన్ని వీలైనంత వరకు తగ్గించాలి. విగ్రహాలకు ఉండే అలంకరణ వస్తువులను నిమజ్జనానికి ముందు తొలగించాలి. ప్లాస్టిక్ వ్యర్థాలను నీటిలో వదలకూడదు. ఈ విషయంలో విద్యార్థులు, యువత చొరవ తీసుకోవాలి.

అవి భద్రత కోసమే...

పోలీసు శాఖ సూచనలు కచ్చితంగా పాటించాలి. భద్రత కోసమే అధికారులు, సిబ్బంది కొన్ని సూచనలు చెబుతారు. కొన్ని ఆంక్షలు విధిస్తారు. వాటిని తప్పనిసరిగా అనుసరించండి. ఫోటోలు, వీడియోలు తీసేటపుడు ఎదుటి వారికి ఇబ్బంది లేకుండా... నిమజ్జన ప్రక్రియకు ఎలాంటి అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకోండి.

- వినాయక నిమజ్జనంలో డ్యాన్సలు కీలక భూమిక పోషిస్తాయి. డీజేలాంటి సౌండ్ సిస్టమ్‌తో చిన్నారులు, పెద్దవారికి ఇబ్బందులు తప్పవు. వీటిపై పూజా కమిటీలు ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. చిన్న పిల్లలు నీటి దగ్గరకు వెళ్ల కుండా జాగ్రత్త పడండి. అర్ధరాత్రి వరకు వేడుకల్లోనే ఉండిపోవద్దు. కాస్త ముందుగానే నిమజ్జ నం పూర్తి చేసేందుకు ప్లాన్ చేసుకోండి. సంప్రదాయాలను గౌరవిస్తూ, నిబంధనలను పాటిస్తూ నిమజ్జనంలో పాల్గొంటే వేడుకను పూర్తిగా ఆస్వాదించగలరు. లేకుంటే విషాదం తప్పదు.

నిబంధనలు పాటించాల్సిందే..

వినాయక చవితి వేడుకల్లో కచ్చితంగా నిబంధనలు పాటించాల్సిందే. అందుకే మండపాలకు ఈ ఏడాది అనుమతులు తప్పనిసరి చేశాం. కానిస్టేబుల్‌కు ఒక దత్తత గ్రామాన్ని కేటాయించాం. లౌడ్‌స్పీకర్లు, సౌండ్ సిస్టం విషయంలోనూ నిబంధనలు విధించాం. ఎటువంటి అశ్లీలత, అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా చేశాం. నిమజ్జనోత్సవాల సమయంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలి. పోలీస్‌శాఖ సూచనలు పాటించాలి. ఆనందంగా జరుపుకోవాలి. నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవు.

-మహేశ్వరరెడ్డి, ఎస్పీ

దోమల నివారణకు మహాయుద్ధం

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



ఇంద్ర పుష్కరిణిలో గంబూషియా చేపలను విడిచిపెడుతున్న కలెక్టర్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా దోమల నివారణకు ఐదు లక్షల గంబూషియా చేపలను సిద్ధం చేశామని, నీటి కుంటలు, చెరువులు, కాలువల్లో వాటిని విడిచి పెట్టడం ద్వారా దోమల నివారణకు మహాయుద్ధం ప్రారంభించామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. అరసవల్లిలో గల శ్రీ సూర్యనారాయణ స్వామివారి దేవస్థానం ఆవరణలోని ఇంద్రపుష్కరిణిలో శనివారం ఆయన 750 చేప పిల్లలను విడిచి పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలను అరికట్టడంలో ఈ చేపలు అస్త్రంలాగా పనిచేస్తాయని అన్నారు. దోమల లార్వా ఆక్సిజన్ కోసం నీటిపైకి వచ్చిన మరుక్షణంలో ఈ చేపలు వాటిని పూర్తిగా తినేస్తాయని వివరించారు. కుంటలు, చెరువులు, చిన్నపాటి నీటి నిల్వల్లో ఎక్కడైనా ఇవి జీవించగలవని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 5 లక్షల చేపపిల్లలను విడిచిపెట్టే ప్రణాళికను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డా.కె.అనిత, ఆలయ ఈవో కేఎస్‌వీడీవీ ప్రసాద్, జిల్లా మలేరియా అధికారి సత్యనారాయణ, మెడికల్ ఆఫీసర్ సాయిదివ్య, ఏఎంఓ శ్రీనివాసరావు, శ్రీకాంత్, నరసింహం, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాగితాల్లోనే కూరలు.. వంటలో ఉండవ్!

(ఐదో పేజీ తరువాయి)

సాగుతుందో లేదో విచారణ చేపడితే అసలు విషయం తెలుస్తుంది.

● హోల్‌సేల్ కన్నా తక్కువ.. ఇక్కడెట్లా ...

హోల్‌సేల్ మార్కెట్‌లో కూడా కూరగాయల ధరలు భారీగానే ఉన్నాయి. అల్లం కిలో రూ.90పైగా ఉండగా.. కేవలం రూ.10కే ఎలా సరఫరా చేయగలరన్నది అనుమానమే. ఇక పందిరి చిక్కుడు, ఎర్రదుంప, పొడువుచిక్కుడు, పొటల్స్, బీరకాయ వంటివి ఉత్తిమాటే అన్న ఆరోపణలు ఉన్నాయి. వంకాయ, బెండకాయలు, క్యారెట్, బీట్‌రూట్, ఇతర కూరగాయలన్నీ.. అక్కడక్కడ కరివేపాకు మాదిరిగా కూరలో కనిపిస్తుంటాయి. ఇలా అయితే విద్యార్థులకు పౌష్టికాహారం ఎలా అనే ప్రశ్న తలెత్తుతోంది. నిమ్మకాయలు అసలు వినియోగించే పరిస్థితి లేదు. కానీ, వాటి ధర మోస్తరుగా ఇవ్వడం కొసమెరుపు.

● ఎవరిని తప్పుబట్టాలి...

ఎంజేపీ ఏపీ బీసీడబ్ల్యూఆర్ స్కూల్స్‌లో విద్యార్థికి రూ.42 చొప్పున.. ఇంటర్ విద్యార్థికి రూ. 46 చొప్పున రోజుకి ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. కానీ టెండర్‌దారుడు ఆశ కొద్దీ దరఖాస్తులు పెట్టినా.. వాస్తవ పరిస్థితిని తెలుసుకుని అమలు సాధ్యమా? కాదా? అన్నది అధికారులు పరిశీలించాలి. బహిరంగ మార్కెట్‌లో ధరల కంటే కనీసం సగానికి కేటాయించినా విద్యార్థులకు న్యాయం జరుగుతుంది. టెండర్ ఖరారు మేరకు కూరగాయలను సమృద్ధిగా సరఫరా చేసేందుకు వీలుంటుంది. ఇప్పుడు అటువంటి పరిస్థితి లేదు. టెండర్ ఇచ్చినంత మేరే స్కూల్స్‌లో విద్యార్థులకు వండి పెట్టాలి. ఉదాహరణకు క్యారెట్ చాలదు.. మరో పది కిలోలు సరఫరా చేయండని వార్డెన్ లేదా ప్రిన్సిపాల్ టెండర్‌దారునికి చెప్పినా వినని పరిస్థితి. స్కూల్‌కు సరిపడా కూరగాయలు అవసరం మేరకు ఇవ్వాల్సిందేనని గట్టిగా అడగలేని దుస్థితి. కాంట్రాక్టరు కూడా కొన్ని కూరగాయలు నాణ్యత లేనివి సరఫరా చేస్తున్నారు. ఇతర జిల్లాలలో అధికారులు కూరగాలయ ధరలను బహిరంగ మార్కెట్‌లో సరిపోల్చి.. అవినీతికి ఆస్కారం లేకుండా ధరలను ఖరారు చేసి.. పకడ్బందీగా విద్యార్థులకు పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకున్నారు. ఇతర జిల్లాల్లో కిలో కూరగాయలు రూ.10కే ఎక్కడాలేదు. ఇప్పుడైనా అధికారులు వాస్తవాన్ని పరిశీలించి.. విద్యార్థులకు నష్టం జరగకుండా.. శాశ్వత చర్యలు తీసుకోవాల్సి ఉంది.

శరవేగంగా..

(ఐదో పేజీ తరువాయి)

కలిపి రూ.46 కోట్లు మంజూరు చేశాయి. 89 మంది నిర్వాసితులకు పునరావాసం కల్పించడంతో పాటు రూ.23లక్షల పరిహారం అందించారు. దీంతో కొద్ది రోజుల కిందట మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే శిరీష వంతెన పునర్నిర్మాణ పనులను ప్రారంభించారు. వచ్చే మార్చి నాటికి వంతెనను అందుబాటులోకి తీసుకువస్తామని ప్రకటించారు. దీనిపై జంట పట్టణవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

'ఎత్తిపోతలు' కోసం ఎదురుచూపు

(ఐదో పేజీ తరువాయి)

కోసం తూలుగు విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి గార వరకు ప్రత్యేక విద్యుత్‌లైన్ ఏర్పాటు చేశారు. పైపులైన్లు, విద్యుత్ లైన్లు, మోటార్లు, నదిలో ఊటబావి మొదలైన పనులన్నీ పూర్తయ్యాయి. మిగిలిన పనులు కూడా త్వరగా పూర్తిచేసి శివారు భూములకు సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

శిలాఫలకమే మిగిలింది..

బైరి సాగునీటి కాలువ శివారు భూములకు సాగునీరు అందించేందుకు టీడీపీ ప్రభుత్వ హయాంలో అంబళ్లవలస వద్ద రూ.3.40కోట్ల అంచనాతో ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వంశధారనదిపై ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసి కొర్ని, కొర్లాం తదితర శివారు గ్రామాల పరిధిలోని రెండు వేల ఎకరాలకు సాగునీరు అందజేయాలని భావించారు. ఈ మేరకు అప్పటి ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి 2019 ఫిబ్రవరి 13న శిలాఫలకం వేశారు. ఈలోగా సార్వత్రిక ఎన్నికలు రాగా.. పనులు చేపట్టలేదు. తర్వాత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఇక్కడ శిలాఫలకమే మిగిలిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగునీరు అందక పంటలు నష్టపోతున్నామని వాపోతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి ఈ పథకం పనులు పూర్తిచేయాలని కోరుతున్నారు. ఈ విషయమై ఏపీఎస్ఐడీసీ ఈఈ కె.వి.సుబ్రహ్మణ్యం వద్ద ప్రస్తావించగా నాట్‌స్టార్టెడ్‌లో ఈ ఎత్తిపోతల పథకం ఉన్నందున తిరిగి కొత్తగా అంచనాలు రూపొందించాల్సి ఉందన్నారు.



అంబళ్లవలస వద్ద శిలాఫలకానికే పరిమితమైన ఎత్తిపోతల పథకం

స్మార్ట్ రేషన్ కార్డుల కోసం..

అరసవల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పాత రేషన్ కార్డుల స్థానంలో క్యూఆర్ కోడ్‌తో కొత్తగా స్మార్ట్ రేషన్ కార్డులను జారీ చేసింది. అధికారులు కూడా కార్డుల పంపిణీని సత్వరమే చేపట్టారు. దీంతో ప్రజలు తమ కొత్త కార్డుల కోసం సచివాలయాల వద్దకు పెద్ద ఎత్తున చేరుకుంటున్నారు. దీంతో సచివాలయాలు ప్రజలతో కిటకిటలాడుతున్నాయి. గత వైసీపీ తరహాలో కాకుండా స్మార్ట్ కార్డులను కేవలం లబ్ధిదారుల ఫొటోలతో మాత్రమే అందజేశారు. వీటిపై ఎటువంటి నాయకుల ఫొటోలు లేకపోవడం గమనార్హం. నగరంలోని దమ్మల వీధిలోని సచివాలయం వద్ద శనివారం లబ్ధిదారులు స్మార్ట్ కార్డుల కోసం బారులుతీరారు. వందలాదిగా ఒకేసారి రావడంతో సచివాలయ సిబ్బంది ఇబ్బంది పడ్డారు. దీనికి తోడు లబ్ధిదారుల ముఖ గుర్తింపు, బొటనవేలి ముద్రలు సరిగా పడకపోవడంతో ఇటు సిబ్బంది, అటు లబ్ధిదారులు అవస్థలకు గురయ్యారు. కొత్తగా స్మార్ట్ కార్డులను తీసుకున్న లబ్ధిదారుల్లో ఆనందం కనిపించింది.



దమ్మల వీధి సచివాలయంలో లబ్ధిదారుల క్యూ..



లబ్ధిదారుకు ఫొటో తీస్తూ..



స్మార్ట్ కార్డులతో మహిళలు

వినాయకునికి భక్తిశ్రద్ధలతో పూజలు

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వివిధ ప్రాంతాల్లో విఘ్నేశ్వరుడికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. విభిన్న రూపాల్లో కొలువైన గణనాథులను భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు.

-ఆంధ్రజ్యోతి బృందం



శ్రీకాకుళం కల్చరల్: దమ్మలవీధిలో 15 అడుగుల అండర్ వాటర్ వినాయకుడు



మంగువారితోట రెల్లి వీధిలో..



నరసన్నపేట: శాంతమ్మ కోవెల వద్ద హనుమాన్ హృదయంలో వినాయకుడు



గుజరాతీపేటలో దీపారాధనలో పాల్గొన్న భక్తులు



పలాస: కొత్తవీధిలో దశావతారంలో గణనాథుడు



పాతపట్నం: అచ్యుతాపురంలో సీతారామ, లక్ష్మణ సహిత హనుమంతుని రూపంలో..

లోక్‌అదాలత్‌పై అవగాహన కలిగించాలి



మాట్లాడుతున్న న్యాయాధికారి జ్యోత్స్న

పొందూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ నిర్వ హిస్తున్నామని, దీనిని కక్షిదారులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కలిగించాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి బి.జ్యోత్స్న అన్నారు. ఈ మేరకు శనివారం కోర్టు హాలులో న్యాయవాదులు, పొందూరు, జి.సిగడాం మండలాల పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లోక్ అదాలత్ వల్ల కలిగే ప్రయోజనాలపై గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. పోలీసులు, గ్రామపెద్దలు కక్షిదారులకు నచ్చజెప్పి కేసులు రాజీ చేసుకునేలా చూడాలన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సెప్టెంబరు 13న నిర్వహించనున్న లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్విని యోగం చేసుకునేలా చొరవ తీసుకోవాలన్నారు. ఆరోజు ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ అయ్యేలా ప్రయత్ని స్తున్నామన్నారు.

పోలపోలమ్మను దర్శించుకున్న న్యాయాధికారులు

ఆమదాలవలస, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణ ఇలవేల్పు పాలపోలమ్మ అమ్మవారిని శనివారం జిల్లా అడిషనల్ న్యాయాధికారి ఎస్.ఎం ఫణికుమార్, జూనియర్ సివిల్ న్యాయాధి కారి జి.రమ్య శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారిని ఆలయ పాలకవర్గ ప్రతినిధులు మొదలవలస రమేష్, పాతిన రమణమూర్తి, మున్సిపల్ మాజీ చైర్మన్ కూన అప్పలనాయుడు స్వాగతం పలికి శాలువలతో సత్కరించారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

టెక్కలి రూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని టెక్కలి కోర్టు సివిల్ సీనియర్ న్యాయాధికారి బి.నిర్మల తెలిపారు. శనివారం మొఖలింగపురంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాల్య వివాహాల వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. దీని పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రఘునాథరావు, బార్ అసోసియేషన్ చైర్మన్ పినకాన అజయ్‌కుమార్, వైద్యాధికారి ధనలక్ష్మి, ఐటీడీఎస్ సూపర్‌వైజర్ సంధ్యారాణి, సర్పంచ్ రాకేష్, తదితరులు ఉన్నారు.



టెక్కలి రూరల్: మాట్లాడుతున్న సీనియర్ న్యాయాధికారి నిర్మల

బాల్య వివాహాలపై కోర్టును ఆశ్రయించాలి

ఇచ్ఛాపురం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని జూనియర్ సివిల్ న్యాయాధికారి పి.ఫరీష్‌కుమార్ అన్నారు. శనివారం బాలికోన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలికలకు తల్లిదండ్రులు బలవంతపు బాల్య వివాహాలు చేసేందుకు నిర్ణయిస్తే కోర్టును ఆశ్రయించాలని, మీరు న్యాయం చేయడంతో పాటు తల్లిదండ్రులకు నష్టం జరగకుండా అవగాహన కలిగిస్తామన్నారు. చిన్నవయసులో వివాహాల వల్ల శారీరకంగా అనారోగ్య సమస్యలు ఎదురవుతా యన్నారు. చదువులపైనే దృష్టి సారించాలని, దీనికి తల్లి దండ్రులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సీఐ మీసాల చిన్నమనాయుడు, ఎస్‌ఐలు ముకుందరావు, శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సోమశేఖర్‌రెడ్డి, జి.కామేష్, పలువురు న్యాయవాదులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయాధికారి ఫరీష్‌కుమార్



మాట్లాడుతున్న న్యాయాధికారి కిశోర్‌బాబు

విద్యాభివృద్ధితోనే విజ్ఞానం

హరిపురం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలోని మారుమూల గ్రామాల్లో విద్యాబి వృద్ధి చెందితేనే ప్రజల్లో విజ్ఞానం లభిస్తుందని సోంపేట కోర్టు ఆరవ అదనపు న్యాయాధికారి కె.కిశోర్‌బాబు అన్నారు. మందస ఏజెన్సీలోని పాతకోట, బుడంబో గ్రామాల్లో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యతో కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో సీఐ తిరుపతిరావు, న్యాయవాదులు కె.కృష్ణమోహన్, ఎంసీహెచ్ శ్రీనివాస రావు, జగదీష్ పండా, ఎస్‌ఐ కె.కృష్ణప్రసాద్, ఎంఈవో ఎం.లక్ష్మణరావు, ఎంఎల్ఎస్ఎస్ సిబ్బంది సుజాత, పీటర్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

కొత్తూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి కందికట్ల రాణి సూచించారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. చెడు అలవాట్లకు లోనవకుండా చదువుపైనే దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ చింతాడ ప్రసాద్, ఎస్‌ఐ ఎండీ అమీర్ ఆలీ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ముళ్లపొదల తొలగింపు

పొందూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పొందూరు అంబేడ్కర్ కూడలి నుంచి పాతబస్టాండ్ వరకు ఉన్న ప్రధానరహదారి ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. ముళ్ల పొదలు రోడ్డుపైకి రావడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మూడు రోజుల కిందట ఈ పొదల కారణంగానే రోడ్డు ప్రమాదంలో యాచకురాలు మృతి చెందింది. దీంతో పొందూరు పంచాయతీ ఈవో మోహన్‌బాబు ఎక్స్‌కవేటర్‌తో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి, ముళ్లపొద లను తొలగించే చర్యలు తీసుకోవడంతో వాహనదారులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

అనారోగ్య బాధితుడికి సాయం

సోంపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న పట్టణానికి చెందిన పొట్నూరు రోహిత్‌కు మోడల్ పాఠశాల విద్యార్థులు రూ.76 వేలు, యశోదనగర్ వాసులు రూ.34 వేలు సాయం అందించారు. ఈ మొత్తం రూ.1,10,000 నగదును శనివారం బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

రూ.65 వేలు పలికిన గణేష్ లడ్డూ

కవిటి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): దూగానపుట్టుగలో నిర్వహించిన వినాయక ఉత్సవాల్లో లడ్డూ వేలంపాట శనివారం నిర్వహించారు. వంశోద్ధారక పెద్ద తాత గ్రామసంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవాల్లో తోట గంగారావు కుటుంబ సభ్యులు రూ.65,500లకు లడ్డూను దక్కించుకున్నారు. ఈ మొత్తాన్ని వచ్చే ఏడాది ఉత్సవాల నిర్వహణకు వినియోగిస్తామని నిర్వాహకులు తెలిపారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

ఇచ్ఛాపురం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి(డీవీఈవో) సురేష్ అన్నారు. శనివారం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలను సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. ఎంసెట్ కోచింగ్‌పై విద్యార్థులను అడిగి తెలుసు కున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శరత్‌బాబు, పలువురు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల నృత్యాలు

ఇచ్ఛాపురం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): తిప్పన పుట్టుగలో వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శ్రీవేంకటేశ్వర మ్యూజిక్, డ్యాన్స్ అకాడమీ విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వీరిని మందిర నిర్వాహకులు అభినందించారు. కార్యక్రమంలో అకాడమీ అధ్యక్షుడు చిన్నాగురుస్వామి, నాట్య గురువు శృతి పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలి: అశోక్



విద్యార్థినులను అభినందిస్తున్న ఎమ్మెల్యే బెందాళం అశోక్

ఇచ్ఛాపురం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లోనూ రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. ఇటీవల తిరుపతిలో జరిగిన అమరావతి చాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో స్థానిక బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు రన్నర్‌గా నిలిచి కప్ పొందారు. విశాఖ ఏయూ కాన్ఫరెన్స్ హాలులో మంత్రి నారా లోకేష్ వీరిని అభినందించి రూ.50 వేలు నగదు పురస్కారం అందించారు. ఈ సందర్భంగా శనివారం రామయ్యపుట్టగలో విద్యార్థులను ఎమ్మెల్యే అశోక్ అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసరావు, పీఈటీ లత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. బాలికోన్నత పాఠశాలలో జరిగిన అభినందన సభలో ఖోఖో విజేతలకు జూనియర్ సివిల్ న్యాయాధికారి పి.ఫరీష్ కుమార్ అభినందించారు.

కాలనీల్లో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం



కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నగర శివారు ప్రాంతాల్లోని తిలక్ నగర్, గోవిందనగర్, ఎస్‌బీఐ కాలనీ, చాపురం పంచాయతీలో నీరు నిలిచి పోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ ప్రాంతాల్లో ఎమ్మెల్యే గొండు శంకర్ శనివారం పర్యటించి పరిస్థితిని పరిశీలించారు. అధికారులతో సమన్వయం చేసుకుని శివారు కాలనీల్లో సమస్యల పరిష్కారానికి శాశ్వత చర్యలు చేపడతామన్నారు. ఇప్పటికే సమస్యపై అధికారులతో చర్చించామని, నిల్వ ఉన్న నీటిని తక్షణమే తొలగించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రజలు వ్యాధుల బారిన పడకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కోరారు. టీడీపీ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

మెడికవర్‌లో అరుదైన వ్యాధికి చికిత్స

- కోలుకున్న 12 ఏళ్ల విద్యార్థి



పూర్తిగా కోలుకున్న కార్తీక్‌తో వైద్యులు, సిబ్బంది

అరసవల్లి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): అరుదైన, ప్రాణాపాయమైన డిఫ్యూస్ ఎన్‌సెఫలైటిస్‌తో బాధపడుతున్న 12 ఏళ్ల విద్యార్థి కార్తీక్ పైలకు నగరంలోని మెడికవర్ ఆసుపత్రిలో డాక్టర్ ఎం.శ్రీరంగ (కన్సల్టెంట్ పీడియాట్రిక్ ఇంటెన్సివిస్ట్, నియోనాటాలజిస్ట్) విజయవంతంగా చికిత్స చేసి ప్రాణాలను కాపాడారు. వ్యాధి లక్షణాలిలా.. మెదడులోని ఫ్రాంటల్, పెరైటల్, ఆక్సిపోటల్ లోబ్స్‌లో తీవ్రమైన వాపు కలిగిస్తుంది. సరైన సమయానికి చికిత్స అందకపోతే రోగికి శాశ్వత నరాల సమస్య లేదా ప్రాణాలు పోయే ప్రమాదం ఉండడంతో వైద్యులు వేగంగా రోగ నిర్ధారణ చేసి, అధునాతన న్యూరో ఇమేజింగ్, ఖచ్చితమైన ప్రణాళి కతో చికిత్స అందించి రోగిని పూర్తిగా కోలుకునేలా చేశారు. 'కార్తీక్ పరిస్థితి అత్యంత క్లిష్టంగా ఉంది. సెకండరీ న్యూరో నల్ ఇంజురీని నివారించడం, తక్షణ నిర్ధారణ, సమగ్ర చికిత్సా విధానం ద్వారా పూర్తి రికవరీ సాధ్య మైంది' అని డాక్టర్ శ్రీరంగ అన్నారు. కార్తీక్ ఎటువంటి దీర్ఘకాలిక ప్రభావాలు లేకుండా తిరిగి పాఠశాలకు హాజరై సాధారణ జీవితాన్ని కొనసాగించగలడని వైద్యులు తెలిపారు.

రిటైర్డు ఉద్యోగికి సత్కారం



జగన్మోహన్‌రావును సత్కరిస్తున్న దృశ్యం

అరసవల్లి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం భూసేకరణ ప్రత్యేక ఉప కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక రెవెన్యూ పరిశీలకుడిగా పనిచేసిన బొంపాడ జగన్మోహనరావు పదవీ విరమణ సందర్భంగా శనివారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉప కలెక్టర్ జయదేవి, పూర్వ ఉప కలెక్టర్ లావణ్య, సిబ్బంది పాల్గొని జగన్మోహనరావు సేవలను కొనియాడారు.

ఐబీపీఎస్ ద్వారా పారదర్శకంగా నియామకాలు

- డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ



శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో ఉద్యోగాల నియామక ప్రక్రియను ఐబీపీఎస్ ద్వారా పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ తెలిపారు. బ్యాంకులో 19 అసిస్టెంట్ మేనేజర్లు, 35 స్టాఫ్ అసిస్టెంట్ల భర్తీకి మే నెలలో రాత పరీక్షలు నిర్వహించగా విజయం సాధించిన 18 మంది అసిస్టెంట్ మేనేజర్లు, 31 మంది స్టాఫ్ అసిస్టెంట్లకు నియామక ఉత్తర్వులను అందజేశారు. క్రమశిక్షణతో పనిచేస్తూ బ్యాంకు అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ప్రస్తుతంరూ.2,610 కోట్లు వ్యాపారం చేస్తున్నామని, 2026 మార్చికి రూ.3,500 కోట్లు లక్ష్యంగా నిర్దేశించామన్నారు. సీఈవో డి.సత్యనారాయణ, జీఎం ఎస్‌వీఎస్ జగదీష్, డీజీఎం ఎస్.రమేష్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

- పశువులు, కుక్కలు, కోతుల బారినుంచి కాపాడండి
- మునిసిపల్ సమావేశంలో సభ్యులు



అధికారులను ప్రశ్నిస్తున్న సభ్యులు

ఇచ్ఛాపురం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): కార్యాలయం సుందరీకరణ పనులకు ప్రాధాన్యం కాకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వైస్ చైర్‌పర్సన్ లాబాల స్వర్ణ మణి తదితరులు కోరారు. మునిసిపల్ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అధ్య క్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అజెండాలో పొందుపరిచిన 14 అంశాలపై వాడీవేడిగా చర్చ సాగింది. మునిసిపల్ కార్యాలయం వద్ద రోడ్ల నిర్మాణం, సెమీ బోర్డులు, గేట్లు ఏర్పాటు చేసి కార్యాలయాన్ని సుందరీకరణ చేసేందుకు రూ.11.50 లక్షలతో ప్రతిపాదన చేశారు. దీనిపై స్వర్ణమణి స్పందించి పట్టణంలో పలు ప్రాంతాల్లో రోడ్లు, కాలువలు, లైటింగ్, తాగునీటి సమస్యలతో ప్రజలు బాధపడుతుంటే కార్యాలయం సుందరీకరణకు ముందుకు రావడం ఏమిటని, ప్రజల బాధలు కనిపించడం లేదా అని ప్రశ్నించి దీనిపై డిసెంట్ అందజేశారు. ప్రజల కనీస అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆమె కోరారు. పట్టణంలో 23 వార్డుల్లోనూ ఆవులు, కోతులు, కుక్కల కారణంగా ప్రజలు ప్రమాదాలబారిన పడి గాయాలతో ఆసుపత్రి పాలవుతున్నారని, వీటిని అరికట్టేందుకు ఎప్పుడు చర్యలు తీసుకుంటారని వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతి దివ్య, కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్ అధికారులను ప్రశ్నించారు. దీనిపై కమిషనర్ ఎన్. రమేష్ సమాధానమిస్తూ.. ఆవులను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, అయితే గోశాలకు తరలించేందుకు వారు ఒప్పుకోవడం లేదన్నారు. దీనిపై సభ్యులు మాట్లాడుతూ.. ఆవుల యజమానులకు నోటీసులివ్వాలని, అప్పటికీ వారు స్పందించకుంటే గోశాలకు తరలించాలన్నారు. కోతులు, కుక్కల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని తక్షణం వాటిని నియంత్రిం చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. స్వేచ్ఛానగర్‌లోని అయ్యప్పనగర్ వీధిలో తాగునీటి పైప్‌లైన్ అత్యవసర నిర్మాణం చేపట్టేందుకు నామినేషన్ పద్ధతిలో ఇవ్వడం సరికాదని పేర్కొంటూ స్వర్ణమణి అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈ పనులను ఈ ప్రొక్యూర్మెంట్ ద్వారా టెండర్లు పిలిచి పనులు అప్పగించాలని కోరారు. దీనికి స్పందించిన చైర్‌పర్సన్ టెండర్ ప్రక్రియ ద్వారా పనులు చేపడతామన్నారు. జీరో అవర్‌లో పలు సమస్యలను సభ్యులు ప్రస్తావించారు. 1, 2 వార్డులు పురుషోత్తపురం వార్డులకు సరిపడా తాగునీరు ట్యాంకర్లతో అందించాలని ప్రేమ్, చాట్ల పుష్ప కోరారు. పట్టణంలో పలు చెరువులు ఆక్రమణలకు గురయ్యాయని, సర్వే చేసి ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని స్వర్ణమణి కోరారు. కార్యక్రమంలో పలువురు సభ్యులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి బకాయిలు విడుదల చేయాలి

అరసవల్లి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధి వేతనదారులకు పెండింగ్‌లో ఉన్న రూ.110 కోట్ల వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.ప్రసాద్, గంగరాపు సింహాచలం డిమాండ్ చేశారు. సంఘ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. జూన్ నుంచి ఇప్పటి వరకు కూలీలకు వేతనాలు చెల్లించకపోవడంతో వారు ఇబ్బందులుపడు తున్నారన్నారు. తక్షణం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

ఘనంగా ఆరుద్ర శత జయంతి

శ్రీకాకుళం కల్చరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అభ్యుదయ కవి, సినీ గేయ రచయిత ఆరుద్ర శతజయంతి ఉత్సవం తెలుగు రచయితల వేదిక ఆధ్వర్యంలో శనివారం స్థానికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరుద్ర చిత్రపటానికి అతిథులు పూలమాల వేసి నివాళి అర్పించారు. వారు మాట్లాడుతూ.. ఆరుద్ర అభ్యుదయ భావాలతో రచనలు చేశారని, ఆయన రాసిన త్వమేవాహం.. శ్రీశ్రీ ప్రశంసలు అందుకుందన్నారు. అలాగే సందేశాత్మక గీతాలను రచించారన్నారు. కార్యక్రమంలో నామ రచయిత వాండ్రంగి కొండలరావు మాట్లాడుతూ.. ఆరుద్ర శ్రీశ్రీ సమకాలికులని, ఆయన విశాఖపట్నంలో జన్మించి ఉత్తరాంధ్రకు మంచిపేరు తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వర రావు, ఆర్వీ రమణమూర్తి, వేదిక ప్రతినిధులు డా.కోమలరావు, విశ్రాంత స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తులాల సవరమ్మ, ముట్నూరు ఉపేంద్రశర్మ తదితరులు పాల్గొన్నారు.

హెవీ డ్రైవింగ్‌లో ఎస్సీ మహిళలకు శిక్షణ

శ్రీకాకుళం ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్‌లో ఎస్సీ మహిళలకు శిక్షణ ఇవ్వనున్నామని ఆసక్తి ఉన్న వారు దరఖాస్తులు చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. పీఎంఏజేవై పథకంలో భాగంగా 20 ఏళ్లు పైబడిన వారు అర్హులన్నారు. అలాగే 40 ఏళ్లు దాటిన వారు రెండు మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు సమర్పించాలని, రూ.210 రుసుం చెల్లించాలన్నారు. హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్సు పొందేందుకు రూ.1060 చెల్లించాలన్నారు. అర్హులైన ఎస్సీ మహిళలు, ఈడీ, ఎస్సీ కార్పొరేషన్, శ్రీకాకుళం కార్యాలయంలో దర ఖాస్తులను సెప్టెంబరు 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు 97048 95271, 79817 66308 నెంబర్లలో సంప్రదించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

కుప్పంకు నీళ్లిస్తే వైసీపీకి కడుపు మంట ఎందుకు?

- ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

ఎచ్చెర్ల, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): కుప్పం ప్రజలకు కృష్ణా నదీ జలాలు ఇస్తామని సీఎం చంద్రబాబునాయుడి సంకల్పం నేరవేరిందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్.. కృత్రిమ డ్యామ్ నిర్మించి నీరు ఇవ్వలేదన్న విషయాన్ని వైసీపీ నేతలు గ్రహించాలన్నారు. కుప్పం నియోజకవర్గానికి నీరు ఇచ్చే క్రమంలో కొన్ని వందల చెరువులను నీటితో నింపి లక్షల ఎకరాలకు సాగునీరు అందించిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. సోమవారం పోలవరం అని చెప్పి 67 శాతం ప్రాజెక్ట్ పనులు పూర్తిచేశారన్నారు. 2019-24 మధ్య వైసీపీ ప్రభుత్వం కనీసం 2 శాతం పురోగతిని కూడా సాధించలేకపోయిందన్నారు. కుప్పానికి కృష్ణా నీరు వచ్చినందుకు వైసీపీ నాయకులు అభినందించాల్సింది పోయి, కడుపు మంటతో దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

పాఠశాలలకు టీఎంఎఫ్ మెటీరియల్ అందించాలి

గుజరాతీపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): క్లస్టర్ పాఠశాలలకు సరఫరా చేస్తున్న టీఎంఎఫ్ మెటీరియల్‌ను పాఠశాలలకు చేర్చకుండా హెచ్‌ఎంలే తీసుకు వెళ్లాలని చెప్పడం బాధ్యతారాహిత్యమని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్వీ రమణమూర్తి, జి.రమణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తల్లికి వందనం పేరిట తల్లుల ఖాతాలో వేసిన రూ.13 వేలు మినహా మిగిలిన రూ.2 వేలు టీఎంఎఫ్‌కు కేటాయించారని, మెటీరియల్‌ను స్కూల్ పాయింట్ వద్దకు ఎందుకు చేర్చడం లేదని ప్రశ్నించారు.

సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర పునర్నిర్మాణం

- ఎమ్మెల్యే రవికుమార్



శంకుస్థాపన శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం 25 ఏళ్ల అభివృద్ధి వెనక్కి వెళ్లిందని, దానిని ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో పునర్నిర్మాణం దిశగా సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని 2, 12, 13, 14, 15, 16, 17 వార్డుల్లో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సుమారు రూ.71.74 లక్షల బీపీఎస్, ఎల్‌ఆర్ఎస్ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతోందన్నారు. ఆమదాలవలస గడచిన ఐదేళ్లలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరు వాత మునిసిపాలిటీకి అధిక నిధులను తీసుకువచ్చి పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీతాసాగర్, రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ మొదలవలస రమేష్, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, కమి షనర్ తమ్మినేని రవి, రాష్ట్ర మెడికల్ బోర్డు సభ్యుడు చాపర సుధాకర్, పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు తంగి శంకరరావు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ఆదిత్యునికి లక్ష విరాళం

అరసవల్లి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి నగరానికి చెందిన పూణ్ణ రాజేశ్వరమ్మ రూ.1,00,001 విరాళంగా అందించారు. శనివారం చెక్కును ఈవో కేఎస్‌వీడీవీ ప్రసాద్‌కు అందజేశారు. అనంతరం అర్చకులు దాతలను వేదమంత్రాలతో ఆశీర్వదించగా స్వామి చిత్రపటాన్ని ఈవో అందించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



ఈవోకి చెక్కును అందిస్తున్న దాతలు

రేపు చలో కలెక్టరేట్

టెక్కలి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలపై సోమవారం చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అఖిల భారత విద్యార్థి పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిగిలిపల్లి మదన్‌కుమార్, జిల్లా కన్వీనర్ రోహిత్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీవో నెం.77 వెంటనే రద్దుచేసి పీసీ విద్యార్థులకు ఫీజు రీయిం బర్స్‌మెంట్ కల్పించి న్యాయం చేయాలని, అధిక ఫీజులు వసూలు, సెలవు రోజుల్లో తరగ తులు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని తదితర డిమాండ్లతో కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టనున్నట్లు తెలి పారు. అధిక సంఖ్యలో విద్యార్థులు, ఆయా సంఘాల ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

అనారోగ్యంతో కానిస్టేబుల్ మృతి

- ఎమ్మెల్యే గౌతు శిరీష గన్‌మన్‌గా విధులు
- పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు


అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం


శంకరరావు(ఫైల్)

పలాస రూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పలాస మండలం వీరభద్రాపురం గ్రామానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ తలగాపు శంకరరావు(38) బ్రెయిన్ స్ట్రోక్‌తో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. పలాస మండలం వీరభద్రాపురం గ్రామానికి చెందిన తలగాపు శంకరరావు జిల్లా ఆర్మ్‌డ్ విభాగంలో పని చేస్తున్నారు. ఈయన ప్రస్తుతం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష గన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల ఆయన విధి నిర్వహణలో ఉండగా ఆయనకు బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురై ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందారు. కాగా శంకరరావుకు భార్య శిరీష, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శనివారం పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో కాశీబుగ్గ డీఎస్పీ ఎంవీ అప్పారావు, పోలీసు అధికారులు పాల్గొని నివాళులర్పించారు. అందరితో కలివిడిగా ఉండే శంకరరావు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. కాగా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు డీఎస్పీ ఎంవీ అప్పారావు ఆధ్వర్యంలో శంకరావు భార్య శిరీషకు పోలీసు అసోసియేషన్ తరఫున రూ.లక్ష చెక్కును అందజేశారు. పోలీసు అధికారుల అసోసియేషన్ ట్రెజరర్ భుజంగరావు, కార్యవర్గ సభ్యులు నర్సింగరావు, శంకరప్రసాద్, ఆర్ఎస్ఐలు హరనాథ్, రవి పాల్గొన్నారు. శంకరరావు భౌతికాయానికి టీడీపీ నాయకులు పీరికట్ల విఠల్‌రావు, ఏపీటీడీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, దువ్వాడ శ్రీహర్ష, బూర్లె విజయ్, కృష్ణంరాజు, చంద్రమౌళి నివాళులర్పించారు.

బావిలో పడి వ్యక్తి ఆత్మహత్య


శ్రీనివాసరావు(ఫైల్)

టెక్కలి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మేజర్‌పంచాయతీ టెక్కలిలోని అక్కపువీధికి చెందిన మోనింగి శ్రీనివాసరావు (40) బావిలో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీనివాసరావు శుక్రవారం నుంచి కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు పరిసరాల్లో వెతికారు. కాగా శనివారం ఇంటికి సమీపంలోని బావిలో శ్రీనివాసరావు మృతదేహాన్ని గుర్తించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కాగా మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. శ్రీనివాసరావుకి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు పనులు పూర్తిచేయాలి

- సిరుసువాడ గ్రామ విద్యార్థుల ఆందోళన


నిరసన తెలుపుతున్న విద్యార్థులు

కొత్తూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ సిరుసువాడకు చెందిన విద్యార్థులు పోరుబాట పట్టారు. పనులు ఎప్పటికి పూర్తి చేస్తారంటూ శనివారం నిరసన చేపట్టారు. సిరుసువాడ-కుంటిబద్ర రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.2 కోట్ల నిధులు మంజూరు చేసింది. దీంతో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఈ ఏడాది మార్చిలో పనులకు శంకుస్థాపన చేశారు. అయితే, కాంట్రాక్టర్ సగం పనులు చేసి ఆపేశాడు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో రహదారి బురదమయంగా మారిందని, దీనివల్ల కుంటిబద్రలోని హైస్కూల్‌కు సైకిళ్లు, కాలినడకన వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ సిరుసువాడ విద్యార్థులు నిరసనకు దిగారు. కొన్నిచోట్ల రాళ్లు తేలటంతో కాళ్లకు గుచ్చుకుంటున్నాయని, సైకిళ్ల టైర్లకు పంక్చర్లు అవుతున్నాయని వాపోతున్నారు. సిరుసువాడ నుంచి ఇటు కొత్తూరు రావాలన్న ఇదే పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, గ్రామస్థులు కోరుతున్నారు.

జాబ్‌మేళాకు 42మంది ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో నిర్వాహకులు, పరిశ్రమ ప్రతినిధులు

టెక్కలి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాలో 42మంది ఎంపికైనట్టు కో-ఆర్డినేటర్ బి.ఝాన్సీరాణి తెలిపారు. ఈ జాబ్‌మేళాకు 65మంది విద్యార్థులు హాజరు కాగా టాటా, ఎంఆర్ఎఫ్, భారత్ బయోటెక్, స్నైడర్ పరిశ్రమల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైనవారికి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జయంత్, పావని, కామర్స్ అధ్యాపకులు పి.వెంకటరమణ, జి.కసవయ్య పాల్గొన్నారు.

రేషన్ బియ్యం వ్యాన్ బోల్తా


పొలాల్లో పడిపోయిన బియ్యంతో ఉన్న వ్యాన్

సంతబొమ్మాళి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): కొల్లిపాడు వద్ద రేషన్ బియ్యంతో వెళ్తున్న వ్యాన్ శనివారం సాయంత్రం బోల్తా పడింది. మండలంలోని కొల్లిపాడు, సీపురం రేషన్ డిపోలకు సంబంధించిన బియ్యంతో వ్యాన్ కోటబొమ్మాళి ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి బయలుదేరింది. కొల్లిపాడు వద్ద ఉన్న పెద్దపెద్ద గోతులకు అదుపుతప్పి పక్కనే ఉన్న పంట పొలాల్లో బోల్తాపడింది. బియ్యం బస్తాలు బురదలో కూరుకుపోయాయి. సిబ్బంది స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

రేషన్ స్మార్ట్ కార్డులను తీసుకోవాలి

పలాసరూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకులను పారదర్శకంగా అందజేసేందుకు ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్‌కార్డులను సకాలంలో లబ్ధిదారులు తీసుకోవాలని తహశీల్దార్ ఎస్.కళ్యాణచక్రవర్తి తెలిపారు. ఆయన ఆంధ్రజ్యోతితో శనివారం మాట్లాడుతూ పంచాయతీల్లో సచివాలయం అధికారుల ద్వారా స్మార్ట్ కార్డులను అందజేస్తున్నామని, లబ్ధిదారుడు వారి ఆధార్‌కార్డు, రైస్‌కార్డు వివరాలను తెలియజేసి ఫోటో తీసుకొని వివరాలను నమోదు చేసి అందజేయడం జరుగుతుందన్నారు. వలస ఉన్న లబ్ధిదారులు సెప్టెంబరు 10లోగా తీసుకోవాల్సి ఉంటుందని, స్మార్ట్ కార్డుల ద్వారానే రేషన్ సరఫరా జరుగుతుందన్నారు.

మురుగు కూపాల్లా ఖాళీ స్థలాలు

- డ్రైనేజీలు లేకే ఈ పరిస్థితి
- విజృంభిస్తున్న దోమలు
- రోగాల బారిన ప్రజలు


డ్రైనేజీ లేక మారుతీనగర్-5లో నిలిచిన మురుగునీరు

నరసన్నపేట, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ నరసన్నపేటలోని పలు ప్రాంతాల్లోని ఖాళీ స్థలాలు మురుగు కూపాల్లా మారిపోయాయి. దీంతో దోమల బెడద ఎక్కువై ఆయా ప్రాంత ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. మారుతీనగర్, శ్రీరామ్‌నగర్, శ్రీనివాస్‌నగర్, ఇందిరానగర్, సూరజ్‌నగర్, లక్ష్మీనగర్ తదితర ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు మురుగు నీటితో నిండిపోయి. భారీ భవంతులు మధ్య ఖాళీ ప్లాట్లు మురుగుతో దర్శనమిస్తున్నాయి. చాలా చోట్ల డ్రైనేజీలు లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్య అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోతుందని వాపోతున్నారు. ఖాళీ స్థలాల యజమానులు సైతం ప్లాట్లను ఎత్తు చేసుకోకపోవడంతో నివాసాల్లోని మురుగునీరు ఆయా చోట్ల చేరుతోంది. దీంతో దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు వ్యాప్తి చెంది స్థానికులు రోగాల బారినపడుతున్నారు. ఇప్పటికైనా మేజర్ పంచాయతీ పాలవక వర్గం, అధికారులు స్పందించి దోమలకు నిలయంగా మారిన ఖాళీ స్థలాలు ఎత్తు చేయించేలా చర్యలు తీసుకోవడంతోపాటు డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని ఆయా ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

మళ్లీ పందుల బెడద

పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో పందుల బెడద మళ్లీ మొదలైంది. ప్రధానంగా శ్రీరామ్‌నగర్, మారుతీనగర్, పాతబస్టాండ్, కుమ్మరివీధి, వంశధార నగర్, హడ్కోకాలనీ, ఇందిరానగర్ తదితర ప్రాంతాల్లో స్వైరవిహారం చేస్తున్నాయి. ఇప్పటికే కుక్కలు, ఆవులతో బెంబేలెత్తిపోతున్న జనాలకు పందుల సంచారం ఆందోళన కలిగిస్తుంది. వంశధార కాలనీలోని పాడుబడిన క్వార్టర్స్ పందులకు ఆవాసంగా మారింది. పందులు పెంపకందారులకు అధికారులు నోటీసులు జారీ చేసినా నామమాత్రంగానే మారాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పట్టణంలో పూర్తిస్థాయిలో పందుల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

డ్రైనేజీలు ఏర్పాటు చేయాలి

శ్రీరామ్‌నగర్, మారుతీనగర్, సౌభాగ్యలక్ష్మీనగర్ తదితర ప్రాంతాల్లో డ్రైనేజీలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పాలక వర్గం వెంటనే స్పందించి డ్రైనేజీలు ఏర్పాటు చేయాలి. ప్రజలు కట్టే పన్నులతో మేజర్ పంచాయతీలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

- ముద్దాడ గోపాలరావు, మారుతీనగర్

అధికారుల లోపం వల్లే..

నూతన నిర్మాణాల సమయంలో అనుమతులు ఇచ్చేటప్పుడు అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి నెలకొంది. ఇళ్లు ముందు భాగంలో డ్రైనేజీలు ఏర్పాటుకు ప్లాన్‌లో చూపించినా.. క్షేత్రస్థాయిలో అవి కానరావడం లేదు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఈ సమస్య నెలకొంది. చాల ప్రాంతాల్లో ఈ సమస్యే ఎక్కువగా ఉంది.

- జామి వెంకటరావు, నరసన్నపేట

అన్నీ తొలగిస్తాం

ప్లాన్ ప్రకారం నిర్మాణాలు చేసుకోవాలి. అంతకు మించి ముందుకు నిర్మాణాలు చేపడితే తొలగించి డ్రైనేజీలు ఏర్పాటు చేయిస్తాం. ఖాళీ ప్రదేశాలను మట్టితో పూడ్చాలని యాజమానులకు నోటీలు అందిస్తాం.

- ద్రాక్షాయిణి, ఈవో, నరసన్నపేట

అనర్హులకు ఇళ్ల పట్టాలు ఇచ్చారు

- మంత్రి అచ్చెన్నాయుడికి ఫిర్యాదు


మంత్రి అచ్చెన్నకు ఫిర్యాదు చేస్తున్న ఆనంద్

కోటబొమ్మాళి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): శ్రీజగన్నాథపురం గ్రామ కొండపై జగనన్న కాలనీలో గత ప్రభుత్వం అనర్హులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేశారని, దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి అర్హులకు పట్టాలు ఇవ్వాలని పలువురు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును కోరారు. శనివారం నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో శ్రీజగన్నాథపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు సాసు మహంతి ఆనంద్ ఫిర్యాదు చేశారు. దీనిపై మంత్రి వెంటనే స్పందించి టెక్కలి ఆర్డీవో ఎన్.కృష్ణమూర్తికి ఫోన్‌లో మాట్లాడి పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయాలని సూచించారు. మరింత కొంతమంది వివిధ సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, టీడీపీ నాయకులు బోయిన రమేష్, వెలమల కామేశ్వరరావు, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. అలాగే నిమ్మాడ గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. సతీమణి, మాజీ సర్పంచ్ కింజరాపు మాధవితో కలిసి అన్నసమారాధనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కింజరాపు హరిప్రసాద్, టీడీపీ నాయకలు వెలమల కామేశ్వరరావు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సెమినార్‌లో ఎమ్మెల్యే శిరీష



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్, ఎమ్మెల్యే శిరీష

పలాస, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో శనివారం నుంచి జరుగుతున్న నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ 17వ జాతీయ సమావేశంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, వెంకన్నచౌదిరి దంపతులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు హాజరయ్యారు. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగం, పౌరవిమానయాన శాఖల మధ్య సమన్వయం, వీటివల్ల కలిగే ప్రయోజనాలపై వర్క్‌షాప్ జరిగింది. రాష్ట్రం తరుపున పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు నిర్మాణరంగంలో రాష్ట్ర ప్రగతిపై వివరించారు. అంతకు ముందు నిర్మాణరంగం పుస్తకాన్ని ఆవిష్కరించారు.

పేదలకు పట్టెడన్నం పెట్టాలన్నదే ప్రభుత్వ లక్ష్యం


అన్నక్యాంటీన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మామిడి

పాతపట్నం ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పేదలకు పట్టెడన్నం పెట్టాలన్న లక్ష్యంతోనే కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయ కూడలిలో రూ.60లక్షల వ్యయంతో అన్న క్యాంటీన్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి భూమిపూజను శనివారం సాయంత్రం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పైల బాబ్జీ, సలాన మోహనరావు, సైలాడ సతీష్, తూలుగు తిరుపతిరావు, శివాల చిన్నయ్య, మద్దు రామారావు తదితనేల పాల్గొన్నారు.

- స్థానిక పంచాయతీ కార్యాలయ కూడలిలో తహసీల్దార్ నందిగామ ప్రసాదరావు ఆధ్వర్యంలో నిర్వహించిన స్మార్ట్‌కార్డుల పంపిణీలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పాల్గొని లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు బండి రవివర్మ, టీడీపీ నాయకులు పైల బాబ్జీ, సైలాడ సతీష్, మద్దు రామారావు, దువ్వారి ఉదయ్‌భాస్కర్, బుద్దల నరేష్ శ్రీరామ్ దుర్గాప్రసాద్, మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

బుడితి సొసైటీకి పూర్వ వైభవం తేవాలి


బాలకృష్ణనాయుడుని అభినందిస్తున్న దృశ్యం

జలుమూరు (సారవకోట), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): బుడితి సొసైటీకి పూర్వ వైభవం తీసుకువచ్చి రైతులకు అందుబాటులో ఉండి అన్నివిధాల ఆదుకోవాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. బుడితి సొసైటీకి నూతనంగా నియమించిన చైర్మన్ పొన్నాన బాలకృష్ణనాయుడు, సభ్యులు బోర ధనుంజయనాయుడు, మెండ సూర్యనారాయణ పదవీ స్వీకార మహోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తొలుత చైర్మన్ బాలకృష్ణనాయుడుతోపాటు సభ్యులుతో రికార్డుపై సంతకాలు చేయించారు. ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, టీడీపీ మండల అధ్యక్షులు కత్తిరి వెంకటరమణ, టీడీపీ బీసీ కమిటీ ప్రతినిధి దర్మాన తేజకుమార్, సర్పంచ్ పొన్నాన శంకరరావు, సారవకోట సొసైటీ అధ్యక్షుడు తిరుపతిరావు, సీఈవో చిన్నబాబు నాయకులు త్యాగరాజు, సింహాచలం పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ పనులకు శ్రీకారం

నరసన్నపేట, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక మేజర్ పంచాయతీ డంపింగ్ యార్డ్‌లో తడిచెత్త, పొడిచెత్త వేరు చేసేందుకు పలు పనులకు పంచాయతీ పాలకవర్గం సభ్యులు శనివారం శ్రీకారం చుట్టారు. రూ.5లక్షలతో చెత్త సంపద కేంద్రంలో ఫ్లోరింగ్, అంతర్గత సీసీ రోడ్లు నిర్మాణానికి పనులు ప్రారంభించారు. సర్పంచ్ శంకరరావు, ఉపసర్పంచ్ క్రిష్ణబాబు, ఈవో పి. ద్రాక్షాయిణి ఉన్నారు.

వస్తువుల తయారీలో నైపుణ్యం పెంచాలి

జలుమూరు, (సారవకోట), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఇత్తడి, రాగి వస్తువులు తయారీలో నైపుణ్యం పెంపొందించి బావితరాలకి అందించాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. బుడితి కూడలిలో లేపాక్షి వారి ఆధ్వర్యంలో బ్రాస్ అండ్ మెటల్ వస్తువుల తయారీపై నిర్వహించిన గురు,శిష్య హస్తశిల్ప శిక్షణను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇత్తడి, కంచు, రాగి వస్తువులు తయారీలో బుడితి ప్రపంచ దేశాల్లోనే గుర్తింపు తెచ్చిందన్నారు. అయితే తయారు చేసిన వస్తువులకు గిట్టుబాటు లేక మార్కెట్ ధర ఉండక ఈ వస్తువులు అంతరించిపోయే పరిణామాలు ఏర్పడ్డాయన్నారు. నెల రోజులపాటు నిర్వహించే ఈ శిక్షణలో యువత పాల్గొని నైపుణ్యాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. అనంతరం బుడితి గ్రామంలో నిర్మించిన ఉన్నత పాఠశాల అనుబంధ బాలికల వసతి గృహ నూతన భవనం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, సారవకోట సొసైటీ అధ్యక్షుడు సురవరపు తిరుపతిరావు, టీడీపీ నాయకులు దర్మాన తేజకుమార్, కత్తిరి వెంకటరమణ పాల్గొన్నారు.

ప్రతికూల పరిస్థితులను అధిగమించాలి


మాట్లాడుతున్న డాక్టర్ బాల నిక్కు

ఎచ్చెర్ల, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఎదురయ్యే ప్రతికూల పరిస్థితులను అధిగమిస్తేనే వికసిత్ భారత్ సాధ్యమని కెనడాకు చెందిన థామ్సన్ రివర్స్ యూనివర్సిటీ స్కూల్‌ఆఫ్‌సోషల్ వర్క్ హ్యూమన్ సైన్స్ విభాగ అధ్యాపకుడు డాక్టర్ బాల నిక్కు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో 'ఆచరణలో స్థితిస్థాపకత వికసిత్ భారత్-2047 కోసం సంఘాల నిర్మాణం, విద్యార్థుల భాగస్వామ్యం' అనే అంశంపై శనివారం వర్క్‌షాపు నిర్వహించారు. వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని మాట్లాడుతూ.. యువత సమర్థత, నైపుణ్యాలు పెంపొందించుకుంటే వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరవచ్చన్నారు. వర్సిటీ రెక్టార్ అడ్డయ్య, విద్యా విభాగం అధ్యాపకులు హనుమంతు సుబ్రమణ్యం, ఎన్.శ్రీనివాస్, ఎన్వీ స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్విజ్ విజేత బొరివంక జట్టు


విజేతలతో నిర్వాహకులు, అతిథులు

ఇచ్ఛాపురం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఈదుపురం గ్రామంలో బేతాళ యువజన సంఘం 24వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో బొరివంక జడ్పీ హైస్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. హరిపురం గీతం, గాయత్రి పబ్లిక్ స్కూల్ రెండు, మూడు స్థానాలు పొందారు. విజేతలకు బహుమతులను ఎంఈవో ఎస్.విశ్వనాథం, సర్పంచ్ నర్సు ప్రసాద్ అందజేశారు. యువజన సంఘ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొ న్నారు. వ్యాసరచన పోటీల్లో ఇచ్ఛాపురం మున్సిపల్ హైస్కూల్ విద్యార్థిని డి.అనూరాధ, డొంకూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థిని దున్న గాయత్రి, సత్యసాయి పాఠశాలకు చెందిన బి.అశ్విని మొదటి మూడు బహుమతులను వరుసగా పొందారు.

సంతబొమ్మాళి పీఏసీఎస్ చైర్మన్‌గా కూశెట్టి


కూశెట్టి కాంతారావు

సంతబొమ్మాళి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): సంతబొమ్మాళి పీఏసీఎస్ చైర్మన్‌గా మాజీ సర్పంచ్ కూశెట్టి కాంతారావును నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. సభ్యులుగా చాట్ల అప్పలస్వామి, వాడరేవు పాలేసు నియమితులయ్యారు. తనకు చైర్మన్‌గా నియమించిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌కు కాంతారావు కృతజ్ఞతలు తెలిపారు. కాంతారావు నియామకంపై టీడీపీ నాయకులు అభినందించారు.

ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా చైతన్య


గేదెల చైతన్య

పాతపట్నం/మెళియాపుట్టి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నామినేటెడ్ పదవుల నియామకాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ క్రమంలో వివిధ కార్పొరేషన్ బోర్డు డైరెక్టర్ల నియామకాలు చేపట్టగా ఏపీ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పాతపట్నం నియోజకవర్గానికి చెందిన జనసేన పార్టీ నాయకుడు గేదెల చైతన్యను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. దీర్ఘకాలంగా పార్టీకి సేవలందించడంతో చైతన్యకు తగిన గుర్తింపు లభించింది. జనసేనతో పాటు బీజేపీ, టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

యూఏఈలో కాగువాడ వాసి దుర్మరణం

- మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించాలని వేడుకుంటున్న కుటుంబ సభ్యులు


హుస్సేన్ (ఫైల్)

పాతపట్నం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో శనివారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో మండల కాగువాడ గ్రామానికి చెందిన మొగల్ హుస్సేన్ సాహెబ్(44) దుర్మరణం చెందాడు. కాగువాడ గ్రామం వస్త్రపురికాలనీకు చెందిన హుస్సేన్ గత కొన్నేళ్లుగా ఉద్యోగరీత్యా యూఏఈలోని ఓ పెట్రోలియం ఉత్పత్తి పరిశ్రమంలో పనిచేస్తున్నాడు. శనివారం సాయంత్రం కంపెనీలో జరిగిన ప్రమాదంలో మృతి హుస్సేన్ చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. హుస్సేన్‌కు భార్య సుల్తానా బేగంతోపాటు పదేళ్ల కుమారుడు అల్తాఫ్ ఉన్నారు. కాగా హుస్సేన్ మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చేందుకు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తోపాటు కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు చొరవ తీసుకోవాలని కుటుంబసభ్యులు గ్రామస్థులు కోరుతున్నారు.

సర్టిఫికెట్లు తీసుకుని తిరిగి వస్తుండగా..

- రోడ్డు ప్రమాదం
- యువకుడికి బ్రెయిన్ డెడ్


శేఖర్(ఫైల్)

ఎచ్చెర్ల, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల సమీపంలో పాత జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వీరఘట్టం మండలం గడబవలసకి చెందిన చిలకల శేఖర్(25) తీవ్రంగా గాయపడి బ్రెయిన్‌డెడ్‌కు గురయ్యాడు. ఎస్ఐ వి.సందీప్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. బీపీఈడీ పూర్తి చేసిన శేఖర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో సర్టిఫికెట్లు తీసుకుని మోటారు బైక్‌పై తిరిగి వెళ్తుండగా ముందు వెళ్తున్న కారును ఢీ కొట్టాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన శేఖర్‌ను శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించగా వైద్యులు బ్రెయిన్ డెడ్ అయినట్టు గుర్తించారు. కుటుంబ సభ్యులు అవయవ దానం చేసేందుకు ముందుకు రావడంతో క్షతగాత్రుడిని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఉంచారు. బీపీఈడీ పూర్తిచేసి గుంటూరులో ఎంపీఈడీ కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకు సిద్ధమైన శేఖర్‌కు ఇలా ప్రమాదానికి గురికావడంతో కుటుంబ సభ్యులు ఆవేదనకు గురయ్యారు.

చెరువులో పడి విద్యార్థిని మృతి

మెళియాపుట్టి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): దేగలపోలూరు గ్రామానికి చెందిన సవర రజని(9) శనివారం సాయంత్రం గ్రామ సమీపంలో ఉన్న చెరువులో ప్రమాదవశాత్తు పడి మృతి చెందింది. రజని పుట్టుకతోనే మూర్ఛ వ్యాధి ఉన్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. దీనబంధుపురం మండల పరిషత్ పాఠశాలలో రజని నాలుగో తరగతి చదువుతుంది. ఇద్దరు అక్కలు ఉన్నారు. ఎస్ఐ రమేష్‌బాబు గ్రామానికి వెళ్లి వివరాలు సేకరించినట్టు తెలిపారు.

3న ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

టెక్కలి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా కేంద్ర ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం వచ్చే నెల 3వ తేదీ ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్టు ఆసుపత్రి సిబ్బంది శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయడు, రాష్ట్రమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్స్ అందరూ సమావేశానికి హాజరు కానున్నారని పేర్కొన్నారు.

అన్ని సేవలు అందాలి

నరసన్నపేట, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రతీ ఒక్క కుటంబానికి రెవెన్యూ సేవలను పూర్తి స్థాయిలో అందించాలని తహసీల్దార్ ఆర్.సత్యనారాయణ సూచించారు. శనివారం స్థానిక కార్యాలయంలో వీఆర్వోలతో సమీక్షించారు. గ్రామాల్లో నీటితీరువా శిస్తు వసూలు చేయాలని, గ్రామ రికార్డులను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. వచ్చే నెలలో నరసన్నపేటలో నిర్వహించే కలెక్టర్ సమావేశం నాటికి పెండింగ్ లేకుండా చేయాలన్నారు. కార్యక్రమంలో డీటీ పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ రూ.8,400

నందిగాం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మణిగాం ఎస్సీ కాలనీలో వినాయక మహోత్సవాలు సందర్భంగా ఏర్పాటుచేసిన వినాయకుని లడ్డూ రూ.8,400 పలికింది. ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో శనివారం వేలం వేయగా కాలనీకి చెందిన మట్ట ఇల్లేసు దంపతులు దీన్ని దక్కించుకున్నారు. అనంతరం వినాయకుని ఊరేగింపు నిర్వహించి స్థానిక ధర్మకోనేరులో నిమజ్జనం చేశారు. అలాగే నరేంద్రపురంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద సామూహిక కుంకుమపూజలు నిర్వహించారు. హరిదాసుపురం, సవరరామక్రిష్ణాపురం తదితర గ్రామాల్లో అన్నప్రసాద వితరణ చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

వజ్రపుకొత్తూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలం ఉద్దానంరామక్రిష్ణాపురం మాజీ సర్పంచ్ చింత జనార్దన ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న పలాస కాశీబుగ్గ మునిసిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, అగ్రికులక్షత్రియ మాజీ డైరెక్టర్ జుత్తు నీలకంఠం, పలాస పీఏసీఎస్ మాజీ చైర్మన్ దువ్వాడ శ్రీధర్ (బాబా) ఆ కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. సర్పంచ్‌గా సుదీర్ఘ అనుభవం కలిగిన చింతజనార్ధతో ఉన్న ఆనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

దోమలు నివారణకు చర్యలు

హిరమండలం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో దోమలు నివారణకు చర్యలు చేపడుతున్నట్టు హిరమండలం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.సాయికుమార్ చెప్పారు. ఈమేరకు పీహెచ్‌సీ పరిధిలో పలు గ్రామాల్లో ఖాళీ స్థలాల్లో ఉన్న మురుగు ప్రాంతాల్లో గంబూషియా చేపలను విడిచి పెట్టారు. ఈ చేపలు దోమలు పెరుగుదల నివారణకు వాటి లార్వాలను తినేసి అరికడతాయని చెప్పారు.

- ఎల్ఎన్ పేట, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోగల చెరువుల్లో గంబూషియా చేపపిల్లలు పెంపకం ద్వారా అంటువ్యాధులు నివారించవచ్చునని తురకపేట పీహెచ్‌సీ వైద్యాధికారి పాపారావు తెలిపారు. తురకపేట గ్రామంలోగల వాడుకలకోనేరులో శనివారం గంబూషియా చేపపిల్లలను విడిచిపెట్టారు. గ్రామాల్లో మలేరియా, డెంగ్యూ, ఫైలేరియా మొదలైనటువంటి అంటు వ్యాధులు కలిగించే దోమల లార్వాలను గంబూషియా చేపపిల్లలు మింగేస్తాయన్నారు.

పోలీసుల కార్డన్ సెర్చ్

మెళియాపుట్టి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): భరణికోట, జక్కర వీధి, జన్నిబంద గ్రామాల్లో శనివారం వేకువజామున పోలీసు కార్డన్ సెర్చ్ నిర్వహించినట్టు ఎస్ఐ పిన్నింటి రమేష్‌బాబు తెలిపారు. ఇంటింటికీ వెళ్లి తనిఖీలు చేపట్టారు. సరైన పత్రలు లేని నాలుగు ద్విచక్ర వాహననాలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఎస్ అప్పన్నరెడ్డి తదితరులు ఉన్నారు.

నేత్రదానంపై అవగాహన

హరిపురం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): నేత్రదానంపై ప్రతి ఒక్కరిలో అవగాహన అవసరమని నేత్రవైద్యాధికారి రోణంకి వెంకటరమణ అన్నారు. మందస మండలం హరిపురం గ్రామంలో శనివారం నేత్ర దాన పక్షోత్సవాల సందర్భంగా విద్యార్థుల్లో అవగాహన కల్పించారు. నేత్ర దానం ఆవశ్యకతను వివరించారు.